ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 7 మార్చి 2025



ఇంటర్ పరీక్షలకు 583 మంది గైర్హాజరు

బెలగాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో గురువారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 583 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ జిల్లా విద్యాశాఖాధికారి మంజులవీణ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 9,745 మంది విద్యార్థులకు గాను 9,162 మంది హాజరైనట్లు చెప్పారు. జనరల్ విభాగంలో 6,711 మందికి 6,456 మంది, ఒకేషనల్ విభాగంలో 3,034 మందికి 2,706 మంది హాజరుకాగా, 583 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

హాస్టళ్లు 16.. వార్డెన్లు ఏడుగురు

- వసతి గృహాలను వేధిస్తున్న సంక్షేమాధికారుల కొరత
- కొందరికి అదనపు బాధ్యతలు అప్పగింత
- అభివృద్ధికి నోచుకోని హాస్టళ్లు
- అరకొర నిధులు విడుదల
- కొన్నిచోట్ల అద్దె భవనాలే దిక్కు



శిథిలావస్థలో ఉన్న చినమేరంగి ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్ల భవనం

జియ్యమ్మవలస, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ వసతి గృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఒకపక్క సంక్షేమ అధికారుల (వార్డెన్లు) కొరత వేధిస్తుంటే, మరోపక్క శిథిలావస్థలో ఉన్న భవనాలు భయపెడుతున్నాయి. ఇంకొకపక్క అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ముఖ్యంగా 16 హాస్టళ్లకు ఏడుగురే వార్డెన్లు ఉండడం సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బీసీ హాస్టళ్లు అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకుంటుందని ఆశపడిన విద్యా ర్థులు, వారి తల్లిదండ్రులకు నిరాశే మిగులుతోంది. అధికారం చేపట్టి తొమ్మిది నెలలు అవుతున్నా వార్డెన్ పోస్టుల భర్తీపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. అధ్వా నంగా ఉన్న వసతి గృహాలకు సంబంధించి మైనర్ రిపేర్ల కోసం అరకొర నిధులు మాత్రమే విడుదల చేసింది.



చినమేరంగి వసతి గృహంలో మరుగుదొడ్లు, డ్రింకింగ్ వాటర్ దుస్థితి

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో వెనుకబడిన తరగతుల విద్యార్థులకు సంబంధించి ప్రీ మెట్రిక్ హాస్టళ్లు 10, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు 6 ఉన్నాయి. జియ్యమ్మవలస, రావివలస, చినమేరంగి, కురుపాం, గరుగుబిల్లి, పార్వతీపురం (బాలికలు), పార్వతీపురం (బాలురు), నర్సిపురం, బూర్జ, పాచిపెంటలోని ప్రీ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 490 మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు. పాలకొండ, చినమేరంగి (బాలురు), చినమేరంగి (బాలికలు), పార్వతీపురం (బాలురు), పార్వతీపురం (బాలికలు), సాలూరు (బాలురు)లో పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉండగా, వీటిల్లో 387 మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు. ఈ 16 వసతి గృహాలకు 16 మంది సంక్షేమాధికారులు (వార్డెన్లు) ఉండాలి. కానీ ఏడుగురు మాత్రమే ఉన్నారు. దీంతో హాస్టళ్ల నిర్వహణ గాడి తప్పింది.

11 హాస్టళ్లకు రూ.21 లక్షలే..

జిల్లాలో 16 హాస్టళ్లకు గాను 11 వసతి గృహాల్లో మరమ్మతులకు ప్రభుత్వం రూ.21 లక్షలు మంజూరు చేసింది. 9 ప్రీ మెట్రిక్, రెండు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో మరుగుదొడ్లు, స్నానపు గదుల మరమ్మతులకు రూ.14.1 లక్షలు, విద్యుదీకరణకు రూ.3.1 లక్షలు, తలుపులు, కిటికీల మరమ్మతులకు రూ.3.5 లక్షలు (మిగతా 8వ పేజీలో..)

అదనపు బాధ్యతలతో సతమతం

- జిల్లాలో ఏడుగురు వార్డెన్లు ఉండగా, వీరిలో నలుగురికి అదనపు బాధ్యతలు అప్పగించారు. గరుగుబిల్లి బీసీ వసతి గృహం రెగ్యులర్ వార్డెన్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావుకు జియ్యమ్మవలస, చినమేరంగి, కురుపాం హాస్టళ్ల బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన పని ఒత్తిడికి గురవుతున్నారు.
- సాలూరు బీసీ వసతి గృహ రెగ్యులర్ మేట్రిన్‌గా పనిచేస్తున్న ప్రమీలకు పాచిపెంట బాలుర వసతి గృహానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.
- పాలకొండ హాస్టల్(బాలురు)కు సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వార్డెన్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.
- పార్వతీపురం బీసీ హాస్టల్‌లో రెగ్యులర్ సంక్షేమాధికారిగా పనిచేస్తున్న ఎస్.సాంబయ్యకు సీతానగరం మండలం బూర్జ హాస్టల్‌తో పాటు పార్వతీపురం మండలం నర్సిపురం హాస్టల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.
- చినమేరంగి కాలేజీ హాస్టల్‌కు రెగ్యులర్ మేట్రిన్‌గా పనిచేస్తున్న ఎస్.సుభద్రకు చినమేరంగి కాలేజీ గర్ల్స్ హాస్టల్, పార్వతీపురం గర్ల్స్ హాస్టల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.
- మిగిలిన ముగ్గురు వార్డెన్లకు మాత్రం అదనపు బాధ్యతలు ఇవ్వలేదు. వీరిలో హారిక పార్వతీపురం (బాలురు), పి.పద్మజ పార్వతీపురం (బాలికలు), నాగేశ్వరరావు రావివలస బీసీ హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లుగా పనిచేస్తున్నారు. కాగా, ఒక మండలంలో పనిచేస్తున్న వసతి గృహ సంక్షేమ అధికారికి వేరే మండలంలో అదనపు బాధ్యతలు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండుచోట్లకూ వారు ఎలా తిరుగుతారని, విద్యార్థులకు మెనూ ఎలా అందిస్తారని, వారి బాగోగులు ఎలా చూస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

పీ-4 సర్వే పక్కాగా చేపట్టాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి పీ-4 సర్వేను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పీ-4 సర్వేపై శుక్రవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చి శనివారం నుంచి ప్రక్రియను ప్రారంభించాలన్నారు. వారంలోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2.65 లక్షల గృహాలు ఉన్నట్లు చెప్పారు. 'పీ-4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారిత చేకూర్చడానికి, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది నిరుపేదలను గుర్తించాల్సి ఉంది. దీనిపై మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలి. జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించి ప్రభుత్వం సూచించిన ప్రమాణాల మేరకు సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలి. ఒక్కొక్కరు కనీసం 90 గృహాల వరకు సర్వే పూర్తిచేయాలి. వేసవిలో ఎక్కువ తాగునీటి సమస్య ఉండరాదు. జూన్ వరకు తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఎంపీడీవోలు వారి పరిధిలోని కొళాయిలు, బోర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. సమస్యలు ఉన్న చోట తక్షణమే పరిష్కరించాలి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే బోర్లు వేయాలి. జలజీవన్‌మిషన్ ద్వారా బోర్లు మంజూరై ఉంటే తక్షణమే వాటిని (మిగతా 8వ పేజీలో..)




లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు

జిల్లాలో నాలుగు మద్యం దుకాణాలను గీత కులాస్థులకు పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయించినట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ హాజరై లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించారు. తొలుత పార్వతీపురం, సాలూరు, వీరఘట్టం, పాలకొండలోని మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సమక్షంలో లాటరీ తీసి దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2024-26 సంవత్సరానికి నాలుగు మద్యం దుకాణాలను గీత కార్మికులకు పారదర్శకంగా కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలోని నాలుగు దుకాణాలకు మొత్తం 60 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో పార్వతీపురానికి 17, సాలూరు 8, వీరఘట్టం 22, పాలకొండకు 13 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని లాటరీ తీసి సంబంధిత వ్యక్తులకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఏ.శ్రీరంగం, సీఐలు బి.నరసింగరావు, జి.దాసు, కె.సూర్యకుమారి, వీవీఎస్.శేఖర్‌బాబు, పి.శ్రీనివాసరావు, పి.మురళీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ఊతం

- పామాయిల్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- రూ.4కోట్లు విడుదల
- జీడి, జామ, కోకో సాగుకు మరో రూ.20లక్షలు..
- ఆనందం వ్యక్తం చేస్తున్నరైతులు



పార్వతీపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారికి మరింత ఊతమిచ్చి, సాగును ప్రోత్సహించేందుకు నిధులు అందిస్తోంది. ఈ మేరకు జిల్లాలో పామాయిల్ సాగు చేసే రైతులకు రూ.4కోట్లు, జీడి, జామ, కోకో సాగు చేసే రైతులకు మరో రూ.20లక్షలు మంజూరు చేసింది. దీంతో ఉద్యాన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం..

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలోని ఉద్యానశాఖ ద్వారా పంటల సాగుకు సంబంధించి రైతులకు ఎటువంటి ప్రోత్సాహం అందించలేదు. పామాయిల్ మొక్కల కొనుగోలు కోసం రైతులకు ఒక్కరూపాయి కూడా అందించకుండా కాలం గడిపేసింది. పామాయిల్ సాగు కోసం రైతులకు ఇంపార్టెంట్ మొక్కకు రూ.193, స్థానికంగా లభించే మొక్కకు రూ.133, అదేవిధంగా ఎరువులు తదితర కొనుగోలు కోసం హెక్టార్‌కు రూ.5,250 అందించాల్సి ఉంది. అయితే, జగన్ సర్కారు మాత్రం ఎలాంటి చెల్లింపులు చేపట్టలేదు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని రైతులకు రూ.4 కోట్లు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో గతంలో 19,750 ఎకరాల్లో పామాయిల్ సాగు చేయగా, ఇప్పుడు ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. అదే విధంగా జీడి, జామ, కోకో పంటలను సాగుచేసే రైతులకు కూడా ప్రభుత్వం రాయితీలను విడుదల చేసింది. సుమారు రూ.20 లక్షలు (మిగతా 8వ పేజీలో..)

జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదు

- పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి గంగులయ్య



మాట్లాడుతున్న జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి గంగులయ్య

పార్వతీపురంటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆయన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరు గంగులయ్య అన్నారు. గురువారం మన్యం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో రాష్ట్ర ప్రజలు జగన్‌కు సీఎంగా పట్టంకడితే ఐదేళ్ల పాటు అధికారాన్ని దుర్వినియోగం చేశారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టారన్నారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమనైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే పవన్‌పై అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇది పునరావృతం అయితే ఊరుకోనేది లేదని హెచ్చరించారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడలో ఈనెల 14న జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. దీనికోసం పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు తమ వంతుగా కృషి చేయాలన్నారు. అనంతరం జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఎ.మోహన్‌రావు, కె.మల్లేశ్వరరావు, ఎన్.నిబ్రహీం, రిషివర్ధన్, సీనియర్ నాయకులు పి.రవికృష్ణ, ఆర్.కరుణాకర్, బి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉంటాం

- ఎస్పీ మాధవరెడ్డి
- ఆకట్టుకున్న పోలీసు 'ఓపెన్ హౌస్'



ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్పీ, ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డాగ్‌స్క్వాడ్ విన్యాసాలు

బెలగాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించాలని, వారి భద్రత, రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా బెలగాంలోని పోలీస్ సమావేశ మందిరంలో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ హాజరై మాట్లాడారు. పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాలపై అవగాహన కల్పించారు. వివిధ కేసుల దర్యాప్తుల్లో వినియోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ గురించి వివరించారు. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఎస్పీ అంకితా సురానా, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, సీఐలు, మహిళలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల బీభత్సం

- పంటలు, వ్యవసాయ పంపు సెట్ల ధ్వంసం

కొమరాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగావళి నది ఆవలవైపు ఉన్న మాదలంగి, పాలెం గ్రామాల మధ్య ఉన్న పంట పొలాల్లో గజరాజులు బీభత్సం సృష్టించాయి. పంటలను, వ్యవసాయ పంపు సెట్లను ధ్వంసం చేశాయి. బుధవారం రాత్రి, గురువారం ఉదయం ఏడు ఏనుగుల గుంపు పంటలపై పడి నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పామాయిల్ మొక్కలను పీకి వేయడంతో పాటు అరటి, మొక్కజొన్న, కర్బూజా పంటలను నాశనం చేశాయి. వేలాది రూపాయల మదుపులు పెట్టి పంటలు వేశామని, ఫలసాయం చేతికి అందుతుందన్న తరుణంలో ఏనుగుల గుంపు నాశనం చేస్తున్నాయని రైతు రామచంద్ర పాత్రుడు వాపోతున్నాడు. ఆయిల్‌పామ్ మొక్కల కోసం వేసిన డ్రిప్ పరికరాలు, మోటార్లను ఏనుగులు ధ్వంసం చేశాయని మరొక రైతు మహేష్ చెప్పాడు. తక్షణమే ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించి రైతులను ఆదుకోవాలని కోరారు.



మొక్కజొన్న పంటను నాశనం చేస్తున్న ఏనుగులు

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా రెవెన్యూ అధికారి హేమలత

పార్వతీపురంరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అన్నారు. గురువారం ఆమె తన చాంబర్‌లో మహిళా దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని సజావుగా, సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, చేనేత, ఐటీడీఏ, వ్యవసాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేస్తాయని, వాటికి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. వేదిక ఏర్పాట్లను గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పర్యవేక్షిస్తారన్నారు. పలువురికి సర్టిఫికెట్లు, బహుమతుల ప్రదానంతో పాటు సత్కారాలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి టి.కనకదుర్గ, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, డీఈవో ఎస్.తిరుపతినాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎంపీ కరుణాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలిపల్లి పైడితల్లి 99వ జాతర
- 9 నుంచి ప్రారంభం..

6లో

తెర్లాంలో ఎంఎస్‌ఎంఈ పార్కు
- 40 ఎకరాలు గుర్తింపు

శాసనసభలో మన వాణి

ప్రభుత్వ దృష్టికి హెల్డోవర్ భూసమస్య..

● ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



లక్కవరపుకోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న హెల్డోవర్ భూసమస్యలను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఆమె అసెంబ్లీలో మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూములను సాగుచేస్తూ నేటికీ భూములపై హక్కులు లేకుండా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నియో జకవర్గంతో పాటు జిల్లాలో ఇటువంటి సమస్య ఉందని వెంట నే పరిష్కరించి రైతులకు హక్కులు కల్పించా లని రెవెన్యూ మంత్రి ని కోరారు. ఎల్.కోట మండలంలో దాసుల్లు పాలెం గ్రామంలో సుమారు 60 మందిరైతులు 31 ఎకరాలను ఏళ్ల తరబడి సాగుచేస్తున్నారని వారికి నేటికీ భూమిపై హక్కులు లేవని తెలిపారు వారికి న్యాయం చేయాలని కోరారు.

రామతీర్థాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించండి

● ఎమ్మెల్యే నాగమాధవి



నెల్లిమర్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం రామతీర్థాన్ని రాష్ట్రస్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించాలని నెలిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవా దాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి రామతీర్థం రామస్వామివారి దేవస్థానాన్ని రాష్ట్ర స్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా గుర్తించాలని, శ్రీరామనవమికి ప్రభుత్వం తరఫున ఉత్సవం జరపాలని మంత్రిని కోరారు. ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన రామతీర్థాన్ని అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

అసెంబ్లీలో బొబ్బిలి ట్రాఫిక్ సమస్య

● ఎమ్మెల్యే బేబీనాయన



బొబ్బిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో ప్రధానంగా నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) గురువారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రస్తావించారు. ఆయన ప్రసంగం ఇలా సాగింది. 'బొబ్బిలి పట్టణంలోని రహదారులపై నిత్యం ట్రాఫిక్ నెలకొంటుంది. మా అన్న సుజయ్‌కృష్ణరంగారావు మంత్రిగా ఉన్నప్పుడు బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. మిగిలిన రెండు ప్రధాన రోడ్లు కిక్కిరిసి ఉంటున్నాయి. రోడ్ల విస్తరణ కోసం చాలామంది తమ స్థలాలను స్వచ్ఛందంగా ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు. తక్షణం బొబ్బిలి పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి' అన్నారు. అలాగే ఆయన బొబ్బిలి పట్టణ శివారు ప్రాంతాలలో గల పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించారు. సుజయ్‌కృష్ణ రంగారావు హయాంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక జనం చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలని ఆయన కోరారు.

గెడ్డవాగుపై గెద్దలు

● 44 సెంట్ల స్థలంలో రెండువర్గాల కన్ను
● ఒకరి తర్వాత మరొకరు వచ్చి కబ్జా
● గత రెండు రోజులుగా అక్కడ వివాదం
● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
● చర్యలంటూ ప్రకటనలకే పరిమితం



వివాదస్పద వాగు స్థలం ఇదే..

విజయనగరం రూరల్/క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి)

వాగులు, వంకలు, గెడ్డలు, చెరువులకు కాదేది అక్రమణకు అనర్హం అన్నట్లుగా ఉంది విజయనగరంలో పరిస్థితి. నగరం ఏటేటా విస్తరిస్తోంది. మరో ఏడాదిలో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తుంది. నగరంలో రియల్ వ్యాపారం నెమ్మదిగా పెరుగుతోంది. ఇదే చాటున కొంతమంది అక్రమణలకు తెగబడ్డారు. విజయనగరం నుంచి జమ్ము, నారాయణపురం పంచాయతీ పరిధిలో ఉన్న కబ్జా చేసేశారు. 2014 నుంచి ఇది సీరియల్‌లా నడుస్తోంది. ముందు ఒక వర్గం వచ్చి ఆ వాగును చదును చేసి ప్లాట్‌లుగా విస్తరించింది. ఆ తరువాత మరో వర్గం వచ్చి ఆ ప్లాట్లను ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి ఆక్రమించుకుంది. మళ్లీ దాన్ని ప్లాట్లుగా విభజించింది. వీరి వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న విమర్శలు ఉన్నాయి. 2019 నుంచి 2024 వరకూ బాధ్యతలు నిర్వహించిన అధికారులు ఈ వ్యవహారంపై చూసీచూడనట్లు వ్యవహరించారు. విజయనగరం మండలం జమ్మునారాయణపురం పంచాయతీకి చెందిన 148/1 (రెవెన్యూ రికార్డుల ప్రకారం) వాగు ఉంది. ఇది 44 సెంట్లు ఉంది. ఇది ప్రధాన రెండు రహదారులకు దగ్గరగా ఉండడంతో మంచి డిమాండ్ ఉంది. ఒకప్పుడు సెంటు రూ.రెండులక్షలు ఉండగా.. ఇప్పుడు రెట్టింపు అయింది. దీనిపై రియల్టర్లు, రాజకీయ నాయకులు కన్నేశారు. ఆ భూమిని 14 ప్లాట్లుగా విభజించారు. దీన్ని అమ్మేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. తాజాగా రెండు రోజుల నుంచి ఆ స్థలంలో వివాదం నడుస్తోంది. కొత్తగా కొంత మంది ఆ స్థలంలో ప్లాట్లుగా మార్చే పని చేపడు తున్నారు. దీంతో మరో వర్గం అడ్డుకుంటోంది. ప్రభుత్వ స్థలంలో రెండు వర్గాలు ఆధిపత్యపోరు కు దిగినా.. ఇదంతా బహిరంగంగానే సాగుతు న్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. గతంలో అక్కడ ఏర్పాటు చేసిన 'ఇది ప్రభుత్వ భూమి' అన్న బోర్డును తొలగించినా ఎలాంటి చర్యలు లేవు. అది ప్రభుత్వ స్థలమని చెబుతున్నా రేగానీ.. అక్రమార్కులపై చర్యలకు దిగడం లేదు.

క్రిమినల్ చర్యలు తీసుకుంటాం..

జమ్మునారాయణపురంలోని 148/1 వాగు ఉంది. ఇది ప్రభుత్వానికి చెందినది. ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు వీలు లేదు. ఇది వరకే అక్కడ ప్రభుత్వం తరుపున బోర్డు కూడా ఏర్పాటు చేశాం. ఇది తీసేశారని తెలిసింది. ప్రస్తుతం అక్కడ పని జరిగినా రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది అడ్డుకుంటారు. ఆ స్థలాన్ని ప్లాట్లుగా విభజించడం, ఇతరత్రా పనులు చేయరాదు. చేస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాము.

-కూర్మానాథరావు, తహసీల్దార్

తెర్లాంలో ఎంఎస్‌ఎంఈ పార్కు

● 40 ఎకరాలను ప్రాథమికంగా గుర్తించాం
● ఇసుక అక్రమ రీచ్‌లపై నిఘా
● బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



బొబ్బిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి)

● ప్రశ్న: నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు స్థల సేకరణ జరుగుతోందా?

● జవాబు: తెర్లాం మండల కేంద్రంలో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించాం. ఆ సమీపంలోనే ఓ కొండ లాంటి గుట్ట ప్రాంతం కూడా ఉంది. అదంతా ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం చాలా అనుకూలంగా ఉంటుంది. చిలక పాలెం-రాయగడ రాష్ట్రీయ రహదారికి సమీపంలో ఈ భూములున్నాయి. అది సాకారం అయితే ఆ ప్రాంతమంతా అభివృద్ధి చెంద డానికి అవకాశం ఉంటుంది.

● ప్రశ్న: ఇసుక అక్రమ రీచ్‌లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

● జవాబు: బొబ్బిలి మండలం అలజంగి, బాడంగి మండలం గొల్లాది డివిజన్ పరిధిలోని నదీ పరివాహక ప్రాంతాలలో అక్రమ ఇసుక రీచ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టాలని డీఎస్పీ, సీఐలకు, తహ సీల్దార్లకు లేఖలు రాశాం. రెవెన్యూ సిబ్బందిని 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశాం.

● ప్రశ్న: బాడంగి విమానాశ్రయ నిర్మాణం ప్రతిపాదన ఏమైంది?

● జవాబు: బాడంగి విమానాశ్రయంపై కసరత్తు జరుగుతోంది. ఆ స్థలాన్ని ఆనుకొని మరికొన్ని ఎకరాల భూములను సేకరించే ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం విమానాశ్రయానికి ఏయే రెవెన్యూ సర్వే నెంబర్ల లో ఎంతెంత భూమి ఉంది? ఇంకా అవసరమైన భూసేకరణ కోసం ఏయే గ్రామాల రెవెన్యూ నుంచి సేకరించాలి, ఇతర స్థితిగతులపై అధ్యయనం జరుగుతోంది. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను రూపొందించే పనిలో ఉన్నాం.

● ప్రశ్న: బాడంగి ఎయిర్‌స్ట్రిప్ స్వరూపం ఏమిటి?

● జవాబు: ఎయిర్‌స్ట్రిప్ విస్తీర్ణం సుమారు 189 ఎకరాలు, దాని చుట్టూ మరో 500 ఎకరాలు రక్షణ దళాల ఆధీనంలో ఉంది. ఇంకా 1070 ఎకరాల భూములను సేకరించాలన్న ప్రతిపాదన ఉంది. అక్కడ భూముల మార్కెట్, ప్రభుత్వ ధరలను, ఇతరత్రా అన్ని అంశాలను క్రోడీకరిస్తున్నాము. పెద్దఎత్తున కసరత్తు జరుగుతోంది. పూర్తి వర్షాధార ప్రాంతాలైన బాడంగి, తెర్లాం ప్రాంతాలు అభివృద్ధి చెందడానికి ఈ ప్రతిపాదనలు దోహదపడతాయి.

● ప్రశ్న: ప్రభుత్వ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఏ చర్యలు తీసుకుంటున్నారు?

● జవాబు: అక్రమ రిజిస్ట్రేషన్లపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. రామభద్రపురం మండలంలో ఓ నిరుపేద వృద్ధుడు వచ్చి తనకు గల ఎకరా భూమిని ఓ భూస్వామి లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడని లబోదిబోమంటే వెంటనే అక్కడికి స్వయంగా వెళ్లి పరిశీలించాను. పేదలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములు ఎక్కడైనా అక్రమ రిజిస్ట్రేషన్ జరిగితే గట్టి చర్యలు తీసుకుంటాం.

సమగ్ర శిక్ష ఏపీసీకి అరుదైన గౌరవం

● వ్యవసాయ పంపుసెట్లలో ఐరన్‌కు బదులుగా ప్లాస్టిక్ వినియోగం
● 20 ఏళ్ల వరకూ పేటెంట్ పొందిన రామారావు



విలేకర్లతో మాట్లాడుతున్న ఏపీసీ రామారావు

విజయనగరం కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా పని చేస్తున్న రామ రావుకు అరుదైన గౌరవం దక్కింది. రైతులు విని యోగించే వ్యవసాయ పంపుసెట్ల తయా రీలో ఐరన్‌కు బదులుగా ప్రత్యేక ప్లాస్టిక్‌ని ఉపయోగించారు. తద్వారా తక్కువ బరువున్న యంత్ర సామగ్రిని ఆయన అందించారు. ఇందుకు కాను 20 సంవత్సరాల వరకూ పేటెంట్ హక్కు పొందారు. ఈ విషయాన్ని తన చాంబర్‌లో గురువారం విలేకర్ల సమావేశంలో తెలిపారు.

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీపై 10 సంవత్సరాల పాటు పాలిమర్ పుల్లీ డ్రైవన్ సెంట్రిఫుగల్ పంపుపై పరిశోధన చేసినట్లు చెప్పారు. ఇందుకుగాను పేటెంట్ హక్కును 20 సంవత్సరాలకు గత నెల 14న కేంద్రం ప్రకటించిందన్నారు. ధ్రువీకరణ పత్రాన్ని ఈనెల 4న అందుకున్నట్లు తెలిపారు. 2013లో డాక్టరు ఎన్‌టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో ప్రవేశం పొందానని, 2014 నుంచి 2017 వరకూ పీహెచ్‌డీ రీసెర్చ్ కోసం డిజైన్, డెవలప్మెంట్, పెర్ఫార్మన్స్ అవాల్యూషన్ ఆఫ్ పాలిమర్ క్యాడటడ్ సెంట్రిఫుగల్ పంపు అనే అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు. 2013లో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం స్ఫూర్తితో పీహెచ్‌డీకి ఈ అంశాన్ని తీసుకున్నానన్నారు. ఈ తరహా పంపులను వాడడం ద్వారా రైతులు విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉండదన్న ఆలోచనతో ప్లాస్టిక్‌తో పంపుసెట్లను తయారు చేయాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. యంత్రం మెటీరియల్ తగ్గడంతో పాటు ధర తగ్గుతుందన్నారు. కాగా పేటెంట్ హక్కు పొందిన రామారావును జిల్లా అధికారులు అభినందించారు.

ఎంతకి తెగించారు?

● లేఅవుట్‌కోసం చప్టాను తొలగించారు ● చెరువు గర్భంలో రహదారి నిర్మాణం

పూసపాటిరేగ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఎంతకైనా తెగిస్తారనేది ఈ ఘటన రుజువు చేస్తోంది. చెరువు గర్భంలో రహదారి నిర్మాణం చేపట్టడమే కాకుండా నీరు నిల్వ ఉండేందుకు అడ్డంగా నిర్మించిన చప్టాను కూడా తొలగించారు. మండల పరిషత్ కార్యాలయానికి చేరువలో ఉన్న పీతలబంద చెరువు పరిసరాల్లో ఉన్న రైతుల సాగు అవసరాలకు నీరందిస్తోంది. అయితే సమీపంలోవేసిన లేఅవుట్‌కు కొంతమంది రియల్టర్లు చెరువులో రోడ్డు నిర్మాణం చేపట్టారు. అంతేకాకుండా చెరువులో నీరు నిల్వ ఉండేందుకు సాగునీటిశాఖ నిర్మించిన చప్టాను కూడా తొలగించారు. స్థానిక తహసిల్దారు గోవింద్‌కు సమాచారం అందటంతో స్థానిక వీఆర్వో రామకృష్ణ, సిబ్బందిని గురువారం అక్కడికి పంపారు. చెరువుగర్భంలో వేసిన మట్టిని వెంటనే తొలగించాలని, పాడుచేసిన చప్టాను పునర్నించాలని లేఅవుట్ యాజమాన్యానికి చెప్పారు. అయితే రియల్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.



పీతలబంద చెరువలో నిర్మించిన రహదారి, తొలగించిన చప్టా

పల్లకిలో పెళ్లికూతురు

మక్కువ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వివాహాలు వినూత్నరీతిలో చేసుకుంటున్నారు. వ్యవస్థ డీజే శబ్దాలు.. ఫోటోగ్రఫీ మీద ఆధార పడి సాగుతున్నాయి. సాంప్రదాయ పద్ధతి వివాహాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. కానీ కొంతమంది ప్రాచీన పద్ధతులను ఇప్పటికీ వీడలేదు. విశాఖపట్నానికి చెందిన యువకుడికి మండలంలోని చెముడుగూడ గ్రామానికి చెందిన యువతితో దుగ్గేరు రోడ్డులోని సాయి భగవాన్ కళ్యాణ మండపంలో గురువారం వివాహం జరి గింది. పెళ్లికూతురును స్థానిక మజ్జి గౌరమ్మ ఆలయం నుంచి సాంప్రదాయ బద్ధంగా పల్లకిలో కళ్యాణ మండపం వద్దకు తీసుకెళ్లారు. స్థానికు లు ఈ ఊరేగింపును ఆసక్తిగా తిలకించారు.



పల్లకిలో వెళుతున్న పెళ్లికూతురు

ఎల్లమ్మ సిరులు ప్రారంభం

● సంగీత కళాశాల ఎదుట, నల్లచెరువు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సిరులతల్లి ఎల్లమ్మతల్లి సిరుల ఉత్సవాలు విజయనగరంలో గురువారం ప్రారంభమయ్యాయి. భక్తులు ఉదయం నుంచే నగరంలోని ప్రభుత్వ సంగీత కళాశాల ఎదుట ఉన్న ఆలయం, నల్లచెరువులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీలు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఎల్లమ్మ తల్లికి పసుపు, కుంకుమలు సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ సంగీత కళాశాల ఎదుట వున్న ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం సిరిమానోత్సవం జరగనుంది. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఎల్లమ్మ తల్లి



శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

పోలిపల్లి పైడితల్లి 99వ జాతర

● 9 నుంచి ప్రారంభం.. మూడురోజులు ఉత్సవాలు
● నేడు అమ్మవారికి నేత్రోత్సవం, ఖడ్గపూజ

రాజాం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 99వ వార్షిక జాతర ఈనెల 9 నుంచి ప్రారంభం కానుంది. మూడురోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. జాతర నిర్వహణకు దేవాదాయశాఖ, ఎస్వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఈనెల 7న శుక్రవారం నేత్రోత్సవం జరగనుంది. చివరిరోజు మంగళవారం సుమారు లక్షమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా.

● అమ్మవారు రాజాంలో కొలువుదీరడం, ఆలయ నిర్మాణానికి సంబంధించి పలు కథలు ప్రచారంలో ఉన్నా.. 1926లో రాజాంకు చెందిన వాకచర్ల మల్లయ్య మరి కొందరి సహాయంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఏడాదిలో పూర్తి చేశారు. నాటి నుంచి నేటి వరకూ వాకచర్ల కుటుంబీకులు వంశపారంపర్య ధర్మకర్తలుగా, కొండంపేట గ్రామానికి చెందిన లంకలపల్లి కుటుంబీకులు ఘటాల పూజారులుగా కొనసాగుతున్నారు. దేవాదాయశాఖ పరిధిలో ఉన్న అమ్మవారి జాతర ఏటా పాల్గుణ మాసం శుక్లపక్షం, పౌర్ణమి ముందు వచ్చే ఆది, సోమ, మంగళవారాలలో నిర్వహించడం ఆనవాయితీ.

నేడు నేత్రోత్సవం, ఖడ్గపూజ..

అమ్మవారికి నేత్రోత్సవం శుక్రవారం నిర్వహిస్తారు. సంప్రదాయం ప్రకారం వంశ పారంపర్య ధర్మకర్తలు వాకచర్ల కుటుంబీకులు మంగళవాయిద్యాలతో సాయంత్రం అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమలు, పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అమ్మవారి సన్నిధిలో, ఆలయానికి ఎదురుగా ఉన్న వనంగుడి వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారి బుగ్గపై నల్లని చుక్కను పెడతారు. ఈ కార్యక్రమాన్నే నేత్రోత్సవం అంటారు. తర్వాత కొండంపేట గ్రామానికి చెందిన ఘటాల పూజారి లంకలపల్లి సత్యన్నారాయణ కుటుంబీకులు కర్ర ప్రతిమలను పైడితల్లి అమ్మవారి సన్నిధిలో పెడతారు. వారుకూడా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఘటాలపూజారి కుటుంబీకులు అమ్మవారిని తమ వెంట కొండంపేట ఘటాలయానికి తీసుకువెళ్తారు. ఈ కార్యక్రమాన్ని ఖడ్గపూజ అంటారు. నేత్రోత్సవం నుంచి అయిదు రోజుల పాటు పోలిపల్లి పైడితల్లి అమ్మవారు కొండంపేటలోని ఘటాలయంలో కొలువై ఉంటారు.

11న ఘటోత్సవం..

ఈనెల 11న అమ్మవారి ఘటోత్సవం నిర్వహిస్తారు. దీంతో అమ్మవారి జాతర ముగిసినట్లువుతుంది. అమ్మవారిని కొండంపేటలోని ఘటాలయానికి తీసుకువెళ్లిన లంకలపల్లి కుటుంబీకులు జాతర చివరిరోజు రాత్రి 12.09 గంటలకు అమ్మవారి ఆలయ ప్రవేశం చేయిస్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి వదిలి వెళ్లిపోతారు. అలా అమ్మవారిని యథాస్థానంలో వదిలివెళ్లడాన్ని ఘటోత్సవం అంటారు.

● ప్రతిష్ఠాత్మకంగా..

పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఉత్సవాలను ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ నిర్ణయించారు. ఎమ్మెల్యే సోదరుడు టీడీపీ సీనియర్ నాయకుడు కోండ్రు జగదీష్ సారథ్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈనెల 10న జబర్దస్త్, ఢీ కళాకారులచే మణిపూర్ డాన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జాతర చివరిరోజున మంగళవారం రాత్రి ఘటోత్సవం అనంతరం గతానికి భిన్నంగా భారీస్థాయిలో మందుగుండ సామగ్రి ఏర్పాటు చేశారు.

వక్ఫ్ సర్వే పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని వక్ఫ్ ఆస్తు పరిరక్షణలో భాగంగా ఈనెలాఖరులోగా సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. వక్ఫ్ స్థలాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ రికార్డుల ప్రకారం మొత్తం వక్ఫ్ స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. వెంటనే సంబంధిత ఆర్‌డీవోలు, మున్సిపల్ కమిషనర్లు నివేదికలు అందజేయాలన్నారు. సమావేశంలోని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్‌డీవోలు కీర్తి, సత్యవాణి, మున్సిపల్ కమిషనర్లు నల్లనయ్య, రామప్పలనాయుడు, రామలక్ష్మి,అప్పలరాజు ఉన్నారు.

ఈనెల 8 నుంచి పి-4 సర్వే

విజయనగరం కలెక్టరేట్: పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్(పి-4) సర్వే ఈనెల 8 నుంచి 18 వరకూ జరుగుతుందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సీపీవో ఆధ్వర్యంలో పి-4 సర్వేపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెకర్ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది, గ్రామ స్థాయిలో పనిచేసే సిబ్బంది సర్వేలో పాల్గొంటారన్నారు. ఎంపీడీవోలు పర్యవేక్షణ అధికారులుగా ఇందుకు వ్యవహరించాలన్నారు. సర్వేలో ఇంటింటికి వెళ్లి వాస్తవ సమాచారాన్ని సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 22 మధ్య గ్రామ సభలును నిర్వహించాలని తెలిపారు. 27న తుది నివేదిక ఇవ్వాలన్నారు. ఉగాది సందర్భంగా 30న ముఖ్యమంత్రి పాలసీని ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి తదితరులు ఉన్నారు.

భూసేకరణ ప్రారంభించండి

విజయనగరం కలెక్టరేట్: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో పోలవరం ప్రధాన కాలువ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం రాత్రి తన చాంబర్‌లో ఆయా అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధాన కాలువ నిర్మాణంలో భాగంగా ముందుగా ఏ ప్రాంతాల్లో పనులు ప్రారంభిస్తారో ఆయా గ్రామాల వివరాలు వెల్లడిస్తామన్నారు. జిల్లాలో మూడు భూసేకరణ యూనిట్లు ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి అప్పగించిన మేరకే భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. 59 గ్రామాల్లో 3,314 ఎకరాల భూములు అవసరమని గతంలో జలవనరులు శాఖ ప్రతిపాదనలు పంపించిందన్నారు. కార్యక్రమంలోని జలవనరులు శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


లోకేశ్‌తో ఎమ్మెల్యే అదితి

లోకేశ్‌ను కలిసిన అదితి

విజయనగరం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా, మానవవనరుల శాఖ మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు గురువారం సాయంత్రం కలిశారు. అసెంబ్లీ వాయిదా పడిన వెంటనే ఆమె లోకేశ్‌ను కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను వివరించారు.

వ్యాయామ విద్య అభివృద్ధికి కృషి చేయండి

విజయనగరం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాయామ విద్య అభివృద్ధికి సంబంధిత ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో మాణిక్యంనాయుడు కోరారు. ఇటీవల వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన జి.లక్ష్మణరావు, ఎల్.వెంకటనాయుడు గురువారం డీఈవోను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యాభివృద్ధికి క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎల్‌వీ రమణ, సూర్యారావు తదితరులున్నారు.

వేసవినీటి ఎద్దడిపై కంట్రోల్ రూమ్

రేగిడి, మార్చి 6,(ఆంధ్రజ్యోతి): మండలంలో వేసవి నీటిఎద్దడి నివారణకు మండల పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీచరణ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో తాగు నీటి కొరతపై కంట్రోల్ రూమ్ నెంబరు 9502220951కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేజీబీవీని సందర్శించిన డీఎస్పీ

మెంటాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి సందర్శించారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. సిబ్బంది, నైట్ వాచ్‌మన్ కోసం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. వసతి, భోజన సౌకర్యాలపై ఆరా తీశారు. ఆమె వెంట గజపతినగరం సీఐ రమణ, ఆంధ్ర ఎస్ఐ సీతారాం ఉన్నారు.

సాంకేతిక సాయంతో జాతర విజయవంతం

చీపురుపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన కనకమహలక్ష్మి అమ్మవారి జాతరను సాంకేతిక సాయంతో విజయవంతం చేశామని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. జాతరలో శాంతిభద్రలు, పోలీస్ బందోబస్తు, ఇతర విషయాలను డ్రోన్ కెమేరాల ద్వారా ఎస్పీ మోనటరింగ్ చేశారన్నారు. దీనివల్ల బందోబస్తు సక్రమంగా ఏర్పాటు చేయగలిగామన్నారు. జాతరలో సేవలందించిన చీపురుపల్లి ఎస్ఐ ఎల్.దామోదరరావు, హెచ్‌సీ రమణ, సిబ్బందిని ఆయన స్టేషన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో సీఐ జి.శంకరరావు ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక విడుదల

గరివిడి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 10 వరకు శ్రీవారి 39వ వార్షిక బ్ర హ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త ఏలూరు గురునాథరావు తెలి పారు. ఈ సందర్భంగా ఆయల ఆవరణలో బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను గురువారం విడుద ల చేశారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయ్, గోవిందరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లారమ్మ తొలేళ్లు


అమ్మవారిని వనం గుడికి తీసుకెళ్తున్న దృశ్యం

● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

జామి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇలవేల్పు జామి ఎల్లారమ్మ జాతర వైభవంగా గురువారం రాత్రి ప్రారంభమైంది. గద్దెగుడిలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని వనంగుడికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పులివేషాలు, చిన్నారుల కోలాటం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. జాతరకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీఐ అప్పలనాయుడు బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.


జాతరలో సాంస్కృతిక సందడి

ఐదు రెట్లు పరిహారం చెల్లించండి


సమావేశానికి హాజరైన రైతులు

శృంగవరపుకోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి-బొడ్డవర రోడ్డు విస్తరణలో కోల్పోతున్న భూములకు ఐదు రెట్లు పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశమయ్యారు. రోడ్డు విస్తరణకు సహకరించాలని ఇన్‌చార్జి తహసీల్దారు భరత్‌కుమార్, భూసేకరణ డీటీ హరికిరణ్ రైతులను కోరారు. నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. పరిహారం ఇస్తే కానీ భూమిని సర్వే చేయవద్దనడం సరికాదన్నారు. రైతులు మాట్లాడుతూ గజాల్లో రిజిస్ట్రేషన్ జరిగిన భూములకు ఎలా పరిహారం చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం కాలువకు మరో పక్క భూములను తీసుకుంటే మా కుటుంబాలు ఎలా జీవించాలంటూ రైతులు పొలమరశెట్టి రామకృష్ణ, నానిగిరి స్వామినాయుడు, యలమంచిలి ఈశ్వరరావు, మళ్ల సత్యారావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు చెప్పిన విషయాలను కలెక్టర్ దృష్టిలో పెడతామని అధికారులు అన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం

● ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు


పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

శృంగవరపుకోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు హామీ ఇచ్చారు. గురువారం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో జ్వరాలతో చికిత్స పొందుతున్న గిరిజన చిన్నారులను ఆయన పరామర్శించారు. దారపర్తి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన చిన్నారులకు దద్దుర్లుతో జ్వరాలు వస్తున్నాయన్న సమాచారంతో ఆయన ఆసుపత్రికి వచ్చారు. చిన్నారుల పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో అనారోగ్యానికి గురైన వారికి సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు గురువారం పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చీపురుపల్లికి చెందిన అల్లాడ జగదీశ్వరికి రూ.4,03,990, చెల్లాపురానికి చెందిన అల్తి వెంకటేష్‌కు రూ.1,01,588, రాచగుమడాం గ్రామానికి చెందిన ముదునూరు శ్రీలక్ష్మికి రూ.7,04,084, గరికివలస గ్రామానికి చెందిన నేతేటి లక్ష్మికి రూ.70 వేలు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, కోట్ల మోతీలాల్ నాయుడు, తాడ్డి సన్యాసినాయుడు, టికిరణ్, వెన్నె సన్యాసినాయుడు, దాసరి శివప్రసాద్, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు కల్పించండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలని జాతీయ మానవ హక్కుల పాలక సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొండ్రంకి సంతోష్‌కుమార్ కోరారు. గురువారం డీఈవో మాణిక్యం నాయుడును కలిసి వినతిపత్రం అం దించారు. కార్యక్రమంలో ప్రతినిధులు అప్పారావు, మురళీ, శ్రీనివాస్ ఉన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

● సీడాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్


కె.శ్యామ్‌ప్రసాద్

నెల్లిమర్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణాభివృద్ధిశాఖ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణకార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్) సీడాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. గురువారం ఇక్కడ జిల్లా స్థాయి జేడీఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడాప్ చైర్మన్ జి.దీపక్‌రెడ్డి, సీఈవో పి.నారాయణ స్వామి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో 30వేల మంది యువతకు ఉపాధి, వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సీడాప్ పనిచేస్తోందన్నారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం విస్తరణ, స్కిల్స్, ఇంక్యుబేషన్ సెంటర్ డీన్ ప్రొఫెసర్ జె.అనీల్‌కుమార్ బిజినెస్ మోడళ్లు, మార్కెటింగ్ లింకేజీలు, బై బ్యాక్ విధానం తదితర అంశాలపై వివరించారు. అలాగే వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం, ఆదాయ మార్గాల కోసం వివరించారు. దినకర్, సుమన్.. చేపల పెంపకం, గొర్రెల పెంపకం, మురుగునీరు శుద్ధి, వెనిలా, సాఫ్రాన్, దుస్తుల తయారీ, ఇ-వాహనాలు, వ్యర్థ పదార్థాల నుంచి కుండల తయారీ తదితర రంగాలలో ఆదాయ మార్గాలు, ఇతర అంశాపై వివరించారు. కార్యక్రమంలో స్టేట్ మిషన్ మేనేజర్లు టి.అశోక్‌కుమార్, రామకృష్ణ, ప్రసాద్, విజయ్‌కుమార్, వివిధ జిల్లాలకు చెందిన జామ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసీ విద్యా దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

నెల్లిమర్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఔషధ విద్యకు పునాది వేసిన ప్రొఫెసర్ మహదేవ్‌లాల్ ష్రాఫ్ జయంతిని జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది ఫార్మా, ఫార్మసీ ప్రాక్టీస్‌లో వ్యవస్థాపకత, స్టార్టప్‌లు ప్రోత్సహించడం ప్రధాన అజెండాగా ప్రభుత్వం పేర్కొందని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఫార్మసీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

రాజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఏర్పాట్లను టీడీపీ నాయకుడు కోండ్రు జగదీశ్, మునిసిపల్ కమిషనర్ రామప్పలనాయుడు. ఈవో మాధవరావు తదితరులు గురువారం పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మూడురోజుల పాటు బొబ్బిలి, సాలూరు, విశాఖ, శ్రీకాకుళం, పాలకొండ తదితర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను జెండా దిబ్బ మీదుగా మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. గురవాన నారాయణరావు, శాసపు రమేశ్‌కుమార్, మద్దు హరి, పెంకి గౌరీశ్వరరావు, టంకాల నాగరాజు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు


పీఎస్‌లో ప్రశ్నపత్రాలు

భోగాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు గురువారం భోగాపురం పోలీసుస్టేషన్‌కు చేరాయి. ఈనెల 17 నుంచి నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించిన సెట్- 1 ప్రశ్నపత్రాలు విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో భద్రపరిచారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బాలిపల్లి చంద్రమౌళి తదితరులున్నారు.

'చెత్త సంపద' నిరుపయోగం.. మందు బాబులకు ఆవాసం


నిరుపయోగంగా ఉన్న బొడ్డవర చెత్త సంపద కేంద్రం

శృంగవరపుకోట రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించండి అని ప్రభుత్వం చెబుతున్న మాటలు మండలంలోని బొడ్డవర పంచాయతీ సిబ్బంది చెవికెక్కడం లేదు. గ్రామంలో సేకరించిన చెత్తను విశాఖ-అరకు ప్రధాన రహదారి పక్కన పోసేసి చేతులు దులుపుకుంటున్నారు. గ్రామంలోని చెత్త సంపద కేంద్రం వైపు కన్నెత్తి చూడటం లేదు. దాంతో అది మందు బాబులకు ఆవాసంగా మారింది. రోజూ అక్కడే మందు బాబులు తాగి చిందులు తొక్కుతున్నారు. రాత్రిళ్లు పేకాడుతున్నట్టు సమాచారం. సమున్నత లక్ష్యంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.


మందుబాబులు తాగి పడేసిన సీసాలు

బైక్‌లు ఢీ: వ్యక్తి మృతి

క్రైంన్యూస్

రామభద్రపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తారాపురం టీకాల లచ్చన్న గుడి సమీపంలో గురువారం ఉదయం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రసాద్ వర్మ (40), పవన్‌కుమార్‌వర్మ, రాంపాల్ గౌతమ్‌లు ఒకే బైకుపై సాలూరు నుంచి బొబ్బిలి వెళ్తున్నారు. అయితే ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న అనకాపల్లికి చెందిన మరిశర్ల రామదానును తప్పించబోయి ఆలయం గోడకు తగిలి, బోల్తా పడ్డారు. ఈ ప్రమాదంలో ప్రసాద్‌వర్మ (40) అక్కడికక్కడే మృతిచెందారు. పవన్‌కుమార్‌వర్మ, రాంపాల్ గౌతమ్‌లకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు అగ్ని ప్రమాదాల్లో తోటలు దగ్ధం

కొత్తవలస, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదాలలో టేకు, జీడిమామిడి తోటలు దగ్ధమైనట్టు కొత్తవలస అగ్నిమాపక కేంద్రాధికారి వై.అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం మండలంలోని వియ్యంపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన నీలంశెట్టి కన్నంనాయుడుకు చెందిన టేకు తోట కాలిపోయిందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 వేల ఆస్తి నష్టం జరిగి ఉంటుందన్నారు. కొత్తవలస పంచాయతీ చింతలదిమ్మ ప్రాంతంలోని ప్రభుత్వ కొండ పోరంబోకు భూమిలోని జీడిమామిడి తోటకు నిప్పంటుకోవడంతో జీడిమామిడి తోట కాలిపోయిందన్నారు. ఈ ప్రమాదంలో రూ.10 వేల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందన్నారు.

గంజాయి స్వాధీనం

నెల్లిమర్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో చంపావతి నది తీరంలో థామస్‌పేట గ్రౌండ్ వద్ద గంజాయిని ఒడిశాలోని రాయగడ నుంచి నెల్లిమర్ల పట్టణానికి తరలిస్తున్న వ్యక్తిని, దానిని కొనుగోలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి సుమారు 1.160 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాజాంలో 'లీగల్ మెట్రాలజీ' దాడులు


కాటాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

రాజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ దుకాణాల్లో గురువారం తూనికలు-కొలతల శాఖ అధికారులు బలరామకృష్ణ, దామోదరనాయుడు దాడులు నిర్వహించారు. ప్రధానంగా రోడ్లకు ఇరువైపులా పండ్ల దుకాణాల్లో తనిఖీలు చేశారు. కేజీకి 100 గ్రాముల నుంచి 150 గ్రాముల వరకు తరుగు వస్తున్న 10 పండ్ల దుకాణాలపై కేసులు నమోదు చేశారు. మొబైల్ విడి భాగాలను ఎక్కువ ధరలకు విక్రయిస్తున్న రెండు షాపులపై కేసులు నమోదు చేసినట్టు వారు తెలిపారు.

ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్ వద్దు


కరపత్రం విడుదల చేస్తున్న ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం అచ్యుతాపురంలో వాహనాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో-కన్వీనరు ఎ.జగన్మోహన్‌రావు, ఆటో యూనియన్ నాయకుడు రామునాయుడు డిమాండ్ చేశారు. 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆటో స్టాండింగ్ సెంటర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● భోగాపురం: వాహనాల ఫిట్‌నెస్ కేంద్రాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ అన్నారు. గరివిడి మండలం అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని రద్దు చేయాలని కోరతూ 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ఆటో స్టాండ్ ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సూర్యనారాయణ, ఆటో యూనియన్ వర్కర్స్ పాల్గొన్నారు.

చెట్టుకు నిప్పు.. విద్యుత్‌కు అంతరాయం

కొత్తవలస, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస రైల్వే స్టేషన్‌సమీపంలో రైల్వే పీడబ్ల్యూ కార్యాలయం వద్ద నేరేడు చెట్టుకు నిప్పంటుకోవడంతో బుధవారం రాత్రి, గురువారం మధ్యాహ్నం కొత్తవలసలో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కొత్తవలస-విశాఖపట్టణం రోడ్డులోని పీడబ్ల్యూ కార్యాలయం వద్ద నేరేడు చెట్టు సమీపంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయి. ఈ చెట్టుకు బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుంటుంది. ముందుజాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపేశారు. కొత్తవలసకు చెందిన అగ్నిప్రమాద సిబ్బంది రాత్రి 8.30 నుంచి 2 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. గురువారం ఉదయానికి మళీ నిప్పు రాజుకోవడంతో చెట్టు కొమ్మలు విరిగి తీగలపై పడ్డాయి. దాంతో గురువారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

చైతన్య యాత్రలను జయప్రదం చేయండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8 నుంచి 17 వరకూ జిల్లాలో సీపీఎం చేపట్టనున్న ప్రజాచైతన్యయాత్రలను ప్రజలు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 8 నెలలు గడిచినా ప్రజా సమస్యలు పరిష్కారంపై దృష్టి సారించలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. ఈ సమస్యలపై ప్రజల వద్దకు వెళ్లి తెలుసుకుని వాటి పరిష్కారానికి వివిధ రూపాల్లో ఉద్యమాలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఎం ప్రతినిధి వి.లక్ష్మి పాల్గొన్నారు.

హాస్టళ్లు 16.. వార్డెన్లు ఏడుగురు

(5వ పేజీ తరువాయి)

మంజూరయ్యాయి. గరుగుబిల్లి మండల కేంద్రంలోని హాస్టల్ కిచెన్ అభివృద్ధికి రూ.30వేలు మంజూరు చేసింది. ఈ పనుల బాధ్యతను ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ)కి ప్రభుత్వం అప్పగించింది. అయితే, ఈ నిధులతో మరమ్మతులు సాధ్యమేనా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిధులు ఏ మాత్రం చాలవని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. వాస్తవానికి బీసీ సంక్షేమశాఖ వసతి గృహాల దారుణ పరిస్థితిని చూసి రూ.2.45 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. కానీ, కేవలం రూ.21 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి.

అద్దె కొంపల సంగతేంటి?

జిల్లాలో నాలుగు హాస్టళ్లు ఏళ్ల తరబడి అద్దె కొంపల్లో నడుస్తున్నాయి. వీటిలో జిల్లా కేంద్రం పార్వతీపురంలోని పోస్ట్ మెట్రిక్ బాలురు, బాలికల హాస్టళ్లతో పాటు ప్రీమెట్రిక్ బాలుర వసతి గృహం, జియ్యమ్మవలస మండలం చినమేరంగి కాలేజీ (పోస్ట్ మెట్రిక్) బాలికల వసతి గృహం ఉన్నాయి. వీటికి నెలకు సుమారు రూ.లక్ష వరకు అద్దె చెల్లిస్తూ కొనసాగిస్తున్నారు. శాశ్వత భవనాలు లేకపోవడంతో అద్దె కొంపల్లో అసౌకర్యాల మధ్య విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీసీ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ దృష్టిలో ఉంది

వసతి గృహాల్లో వార్డెన్ల పోస్టులు భర్తీ విషయం, మరమ్మతులకు సంబంధించిన నిధులు విషయం ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టిలో ఉంది. వారి ఆదేశాల ప్రకారమే చర్యలు తీసుకుంటాం.

- ఎస్.కృష్ణ, ఇన్‌చార్జి డీడీ, బీసీ వెల్ఫేర్, పార్వతీపురం మన్యం జిల్లా

ఉద్యాన రైతులకు ఊతం

(5వ పేజీ తరువాయి)

మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో సుమారు 65 వేల ఎకరాల్లో జీడి సాగవుతుంది. పామాయిల్, ఇతర ఉద్యాన పంటల రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బులు జమకానున్నాయి. కాగా, జీడిసాగుకు సంబంధించి క్లస్టర్ విధానాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీని ద్వారా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు సాగుకు మరింత ప్రోత్సాహం అందించనుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పామాయిల్ సాగు చేసే రైతులకు మొక్కలు, ఎరువుల కోసం ప్రభుత్వం రూ.4కోట్లు విడుదల చేసింది. ఈ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కానుంది. జీడి, జామ, కోకో తదితర రైతులకు ఇవ్వాల్సిన రాయితీల కోసం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.

- బి.శ్యామల, జిల్లా ఉద్యానశాఖ అధికారి

పీ-4 సర్వే పక్కాగా చేపట్టాలి

(5వ పేజీ తరువాయి)

వేయించుకోవాలి. జిల్లా పరిషత్ నుంచి నిధులు పొంది పనులు చేపట్టాలి. స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఉపాధి హామీ పథకం కింద రూ.215 కోట్లు జిల్లాకు మంజూరయ్యాయి. ఇప్పటివరకు రూ.158 కోట్ల మేర పనులు పూర్తి చేశారు. మరో రూ.28 కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పనులను ఈనెల 20లోగా పూర్తి చేయాలి.' అని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు, మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడి మృతి

సీతంపేట రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో గడికారెం జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో దుగ్గి గ్రామానికి చెందిన ఆరిక పాపయ్య(45) అనే గిరిజనుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పాపయ్య ప్రతిరోజు మాదిరిగానే గురువారం సాయంత్రం తన బైకుపై స్వగ్రామమైన దుగ్గి నుంచి కాయగూరలు విక్రయించేందుకు గడికారెం గ్రామానికి వెళ్లాడు. అక్కడ కాయగూరలు విక్రయించి తిరిగి వస్తుండగా గడికారెం గ్రామ మలుపు వద్ద బైకు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన పాపయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఆదమ్మతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.

ప్రభుత్వ విధానాలపై మాట్లాడండి



మాట్లాడుతున్న జనసేన నాయకులు

చీపురుపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు మానుకొని, దమ్ముంటే ప్రభుత్వ విధానాలపై వైసీపీ నాయకులు మాట్లాడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ.కోట్లు కూడబెట్టుకున్న జగన్.. పవన్‌కల్యాణ్ కోసం మాట్లాడడం మంచిదికాదన్నారు. జగన్ ఆత్మ విమర్శ చేసుకోకపోవడం విస్మయం కలిగిస్తోందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు యడ్ల సంతోష్, లక్ష్మునాయుడు, కింతలి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి జాతర



ఊరేగింపుగా వెళ్తున్న పూజారులు

బొండపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బొండపల్లిలో గురువారం ఎల్లమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పూజారి బొట్టా సత్యంను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే వనంగుడిలో పరిసర ప్రాంతాలైన కనిమెరక, గిట్టుపల్లి, బోడసింగిపేట, గెద్దపేట, గొల్లలపేట తదితర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పూజారి సిరిమానును అధిరోహించారు. గ్రామ పెద్దలు బి.సత్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ బండారు శ్రీనివాసరావుల పర్యవేక్షణలో జాతర నిర్వహించారు. ఎస్ఐ మహేష్ సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు. ● గంట్యాడ: గంట్యాడ ఎల్లమాంబ సిరిమానో త్సవం శుక్రవారం నిర్వహించనున్నారు. సిరిమానోత్సవానికి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు.

రేపటి నుంచి ఘంటసాల సినిమా ప్రదర్శన

విజయనగరం బాబామెట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన ఘంటసాల ది గ్రేట్ సినిమాను స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్‌లో 8, 10, 11 తేదీల్లో ఉదయం 8.30నుంచి 10.30 గంటల వరకూ ప్రదర్శిస్తామని చిత్ర దర్శకుడు సీహెచ్.రామారావు, ధవళ సర్వేశ్వరరావు తెలిపారు. టిక్కెట్ ధర రూ.147, రూ.100గా నిర్ణయించామన్నారు.

వసతిగృహాలపై పర్యవేక్షణ ఉండాలి

బెలగాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వసతిగృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ చాంబర్‌లో వసతిగృహాల పనితీరుపై ఆ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వసతిగృహాల్లో మెనూ ప్రకారం సక్రమంగా, నాణ్యమైన భోజనం అందిస్తున్నది లేనిదీ సహాయ సంక్షేమాధికారులు తనిఖీలు నిర్వహించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. విద్యాబోధన, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై తనిఖీ చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య కార్యకర్తల పనితీరుపై తనిఖీలు నిర్వహించాలన్నారు. వసతిగృహాల్లో కారిడార్ వద్ద ఆవరణలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ ద్వారా నిఘా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ చంద్రబాబు, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికారిత అధికారి ఎండీ గయాజుద్దీన్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

బెలగాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎం జన్మన్, పల్లెపండగ పనుల పురోగతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

సెల్ టవర్లు వినియోగించుకోండి

బెలగాం: జిల్లాలో జియో, బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు చేయబోయే సెల్ టవర్లను విని యోగించుకోవాలని, ఇందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జియో, బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల ఏర్పాటుపై ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సెల్‌టవర్ మంజూరైనప్పటికీ, వేయడానికి వీలుకాని పక్షంలో దానికి బదులుగా వేరే ప్రాంతాన్ని గుర్తించాలన్నారు. అదే విధంగా సిగ్నల్ వ్యవస్థ లేని టవర్లను కూడా వేరే ప్రాం తానికి మార్చుకునేందుకు వీలుందని కలెక్టర్ తెలిపారు. కొత్తగా సెల్ టవర్లు అవసరమైన ప్రాంతాలను టవర్‌కు సంబంధించిన మెటీరియల్ తీసుకెళ్లేలా రహదారి సౌకర్యం ఉండాలన్నారు. ఒక వేళ రహదారి సౌకర్యం లేకపోతే ఉపాధి హామీ కింద వాటిని మంజూరు చేస్తామని చెపాపరు. ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో కె.హేమలత, డ్వామా పీడీ రామచంద్రరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సీతంపేట రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మండంగి నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తున్నట్టు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. నాగేశ్వరరావు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై గత నెలలో వారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు నాగేశ్వరరావు తోపాటు నైట్ వాచ్‌మన్ పి.త్రినాథరావుపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ఆదేశాల మేరకు పాలకొండ డిప్యూటీ ఈవో ఇటీవల విచారణ చేపట్టారు. విచారణ నివేదిక ఆధారంగా చేసుకుని సదరు ఉపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వాచ్‌మన్ కూడా విధుల నుంచి తొలగించినట్టు ఆదేశాలు వచ్చాయి.

రహదారికి టెండర్లు పిలవండి

కొమరాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్వపాడు బీటీ రోడ్డు నుంచి నయా గ్రామ పంచాయతీ మీదుగా కొండ కూనేరు గ్రామాల మధ్య మంజూరైన రహదారి నిర్మాణానికి టెండర్లు పిలవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ ఇన్‌చార్జి, చీఫ్ ఇంజినీర్ సుబ్బారెడ్డిని టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖ‌ర్‌పాత్రుడు కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలో చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించినట్లు శేఖర్‌పాత్రుడు తెలిపారు. ఇటీవల అటవీ శాఖ అనుమతులు లభించడంతో ఈ రహదారి నిర్మాణానికి టెండర్లు పిలవాలని కోరినట్లు ఆయన చెప్పారు. అలాగే దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని పూర్ణపాడు - లాబేసు వంతెన పనులు పూర్తి చేయడానికి పంచాయతీరాజ్ శాఖ ప్రాధాన్యత అంశాలలో చేర్చి వంతెన పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. వినతిపత్రాన్ని పరిశీలించిన ఎస్ఈ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రాంబాబు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో ఎల్విన్ పేట సీఐ బి.హరి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వాలీబాల్ పోటీలను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు ప్రారంభించారు. ఈ పోటీల్లో 36 జట్లు పాల్గొన్నాయని, మొదటి విజేతకు రూ.10వేలు, రెండో విజేతకు రూ.5వేలతో పాటు ట్రోఫీని అందిస్తామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శివప్రసాద్, నారాయణరావు, నీలకంఠరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సాలూరు రూరల్, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరానికే ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ప్రభుత్వానికి దగ్గరయ్యారని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇందుపూరి గున్నరాజు గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కరానికి తమ సంఘం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. గత రెండుసార్లు ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులునా యుడు ఇదే విధానంతో ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించారన్నారు. ఒక ఉపాధ్యాయ సంఘం ఈ విషయమై రాజకీయం చేసి ఉపాధ్యాయుల్లో గందరగోళం సృష్టించడం సరికాదన్నారు.

కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీ

పాచిపెంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలో గురువారం ఫుడ్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాచిపెంట పాత బస్టాండ్ వద్ద ఒక కిరాణా షాపును పార్వతీపురం ఫుడ్ కంట్రోల్ అధికారి వై.రామయ్య, విజయనగరానికి చెందిన అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ ఈశ్వరిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ షాపులో గల మిర్చి పౌడరు ప్యాకెట్‌ను శాంపిల్ చేశామని తెలిపారు. ఈ ప్యాకెటును తనిఖీకి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఫుడ్ కంట్రోల్ అధికారులు పాచిపెంట వచ్చారని తెలియగానే మిగిలిన షాపులన్నీ మూసివేశారు.

అదనపు ఆయకట్టుకు సాగునీరు ఇవ్వండి

కురుపాం/ గుమ్మలక్ష్మీపురం/ గరుగుబిల్లి, మార్చి6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల తోటపల్లి ప్రాజెక్టు నుంచి అదనపు ఆయకట్టు(గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో గల 8వేల ఎకరాలు)కు సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలో ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు. జంఝావతి ఆయకట్టును స్థిరీకరించి తోటపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో వివిధ ప్రాజెక్టుల ద్వారా ఏఏ ప్రాంతాలకు నీరు ఇవ్వవచ్చు, ఎంతమేరకు ఆయకట్టు స్థిరీకరణ చేయవచ్చు అని చర్చించినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గరుగుబిల్లి మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదన్‌రావు, ఎం.పురుషోత్తమ నాయుడు, అంబటి రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఇరిగేషన్ మంత్రి నిమ్మలకు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి తదితరులు

పదో తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టాలి

● ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉత్తీర్ణతా శాతం పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ పరిధిలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్ష నిర్వహించనున్న అన్ని గదుల్లో గోడ గడియారం ఉండేలా చూసు కోవాలని సూచించారు. పాఠశాలలో మెనూ పాటించాలన్నారు. అన్ని పాఠశాలలకు ప్రహరీ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో కుమార్, ఏటీడబ్ల్యూవోలు మంగవేణి, శ్రీనివాసరావు, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

● వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

బెలగాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్ఆర్సీ)లో ఉన్న పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఎన్ఆర్సీలో పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఓరియంటేషన్ శిక్షణను పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్ఆర్సీని సందర్శించి పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు ఆహారం తినిపించే ముందు చేతులు శుభ్రంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో కె.ఉషారాణి, డెమో సన్యాసిరావు, ఈవో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

పీ-4 సర్వేపై శిక్షణ

వీరఘట్టం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పీ-4 (పబ్లిక్ ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్) సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో బి.వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో పీ-4 సర్వేను సమగ్రంగా నిర్వహించాలన్నారు. పరిపాలనాధికారి డి.వెంకటరావు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమీక్ష

జియ్యమ్మవలస: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పీ-4 సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో శంబంగి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉదయం అలమండ, అంకవరం, బీజేపురం, శిఖబడి, చినమేరంగి, డంగభద్ర, గెడ్డతిరువాడ, ఇటిక, జియ్యమ్మవలస, అర్నాడ, టీకే జమ్ము, పీటీ మండ, కొండచిలకాం సచివాలయ ఉద్యోగులు హాజరవ్వాలని, మిగిలిన సచివాలయ ఉద్యోగులు మధ్యాహ్నం హాజరు కావాలన్నారు.

ప్యాలెస్‌లో ఎక్కువ.. అసెంబ్లీలో తక్కువ



మాట్లాడుతున్న పాలూరు బాబు

బొబ్బిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నోరు పారేసుకోవడంపై జనసేన పార్టీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి పాలూరు బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక జనసైనికుల నిలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన జగన్‌పై నిప్పులు చెరిగారు. జగన్ రెడ్డి ప్యాలెస్‌లో ఎక్కువ.. అసెంబ్లీలో తక్కువ అని, ప్రతి నాయకునికి ఎక్కువ.. ప్రతిపక్ష నాయకునికి తక్కువ అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రం కోసం అనునిత్యం పరితపించే పవన్ కల్యాణ్‌పై జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సంచాన గంగాధర్, మరడాన రవి, శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జానీ, ఉమ్మడి విజయనగరం జిల్లా కార్యదర్శులు గార గౌరీశంకర్, గంటేడ స్వామి, స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

బొబ్బిలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణపై అవగాహన ఉండాలని సీహెచ్‌వో జి.అనూష అన్నారు. గురువారం ఎం.బూర్జవలస గ్రామంలో క్షయ వ్యాధి నివారణపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూడు వారాల కంటే ఎక్కువ దగ్గు ఉన్నా, రక్తంతో కఫం వచ్చినా, బరువు తగ్గుతున్నా సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏఎన్ఎం లక్ష్మి, ఎల్టీ విజయలక్ష్మి, ఎంపీటీసీ జి.దేవి పాల్గొన్నారు.

బత్తిలిలో సంతోషిమాత ఊరేగింపు

భామిని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సంతోషమాత ఆలయ వార్షిక ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు రంపా తాతబాబుశర్మ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. శుక్రవారం నుంచి నేరడి సిర్లి ఎల్లమ్మ యాత్ర మూడు రోజుల పాటు నిర్వహిస్తు న్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

పాలవలస మృతికి అసెంబ్లీలో సంతాపం

పాలకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యుడు పాలవలస రాజశేఖరం మృతి పట్ల రాష్ట్ర శాసనసభలో గురువారం ఎమ్మెల్యేలు, మంత్రులు సంతాపం తెలిపారు. ఈసందర్భంగా పది నిమిషాల పాటు మౌనం పాటించారు. రాజ్యసభ సభ్యుడిగా, శాసనసభ సభ్యుడి, డీసీసీబీ ఛైర్మన్‌గా, జడ్పీ ఛైర్మన్‌గా ఆయన శ్రీకాకుళం జిల్లాకు చేసిన సేవలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కొనియాడారు.

జంపరకోటలో రైతు శిక్షణ

పాలకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జంపరకోట గ్రామంలో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరాజు హాజరై.. జీడి పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పామాయిల్ పంటలో ఎరువులు, పురుగుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. హార్టికల్చర్ ఆఫీసర్ టి.అమరేశ్వరి, గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్ భవానీ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం రక్త పరీక్షలు నిర్వహించారు. తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి బుద్దేశ్వర్ పర్యవేక్షణలో హెచ్‌బీ రక్త పరీక్షలు చేశారు. 150 మందికి రక్త పరీక్షలు చేయగా 15 మంది రక్తహీనత కలిగి ఉన్నట్టు గుర్తించారు. వారికి నెలకు సరిపడా ఐరెన్ మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, ఎన్ఎస్ఎస్ పీవోలు రామయ్య, శ్రీవాణిలు, అధ్యాపకులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

బెలగాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి వారిని ఆదుకోవాలని అగ్రిగోల్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఈవీ నాయుడు, ఆర్వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మొత్తం ఎనిమిది రాష్ట్రాల్లో 32 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని, అగ్రిగోల్డ్ ఆస్తులను విక్రయించి ఆదుకోవాలని వారు కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

కొమరాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెదశాఖ పంచాయతీ పెదపెడుము గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ రామచంద్రరావు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారంపాండ్ పనులు మండలంలో 240కు గాను 120 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు రెండు వారాల్లోగా పూర్తి చేయాలని ఏపీవో బాలకృష్ణను ఆదేశించారు. మండలానికి మరో 650 ఫారంపాండ్ పనులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. పనులను వేగవంతం చేయాలన్నారు.

నేటి నుంచి సిర్లిపోతన్న యాత్ర

పాలకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిర్లిపోతన్న వీధిలో వెలసిన శిర్లపోతన్న, ఎల్లమ్మతల్లి యాత్రా మహోత్సవాలను ఈనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ కమిటీ చైర్మన్ కొల్లి చల్లంనాయుడు, సభ్యులు కోరారు.

ఎల్లమ్మ జాతర..

వీరఘట్టం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధిలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిర్లిపోతన్న, ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి జరిగిన పది రోజుల తర్వాత ఈ యాత్రను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.